నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 25 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

కారు గుర్తుపై ఓటు వేయండి..

మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

బలరావుపేటలో ప్రచారం చేస్తున్న దివాకర్‌రావు

లక్షెట్టిపేట, ఏప్రిల్ 24 : వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మనం మన బీఆర్ఎస్ పార్టీ మన కారు గుర్తుపై ఓటు వేస్తేనే మన కష్టాలు తీరుతాయని మన బతుకులు బాగు పడుతాయని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. బలరావుపేట, జెండా వెంకటాపూర్ గ్రామాల్లో ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతు రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించుకోవాలని, మనమందరం ఏకమై కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వాళ్ల సమస్యలను తెలుసుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే మన కష్టాలు మొత్తం తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, నాయకులు వెల్తపు సుధాకర్, దనిశెట్టి మల్లేశ్, కటుకం అశోక్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరిహారం అందజేత

చెక్కు అందిస్తున్న ఎఫ్‌డీవో అప్పల కొండ, అధికారులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 24 : కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని చింతలమానేపల్లి, పెంచికలపేట్ మండలాల్లో మహారాష్ట్ర నుంచి వచ్చిన ఏనుగు దాడిలో మృతి చెందిన కుటుంబాలకు బుధవారం కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో అప్పల కొండ నష్టపరిహారం చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చింతలమానేపల్లి మండలంలోని బురేపల్లి గ్రామానికి చెందిన అల్లూరి శంకర్(55), పెంచికలపేట్ మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన కారు పోశన్న(74) ఇటీవలే ఏనుగు దాడి చేయడంతో మృతి చెందినట్లు స్పష్టం చేశారు. ఘటన జరిగిన 20 రోజుల్లో బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరి రూ.10 లక్షల చొప్పున చెక్కులు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఎఫ్ఆర్‌వో రమాదేవి, పెంచికల్‌పేట ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో సుధాకర్, బాధిత కుటుంబ సభ్యులు సుగుణ, సుశీల పాల్గొన్నారు.

జక్కాపూర్‌లోని పోలింగ్ కేంద్రంను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే

కలెక్టర్ ఆకస్మిక పర్యటన

పోలింగ్ కేంద్రాలు, చెక్‌పోస్టు పరిశీలన

సిర్పూర్(టీ), ఏప్రిల్ 24 : జక్కాపూర్, హుడ్కులీ గ్రామాల్లో కలెక్టర్ వెంకటేశ్ దౌత్యే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీలు బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా జక్కాపూర్ గ్రామంలోని అమ్మ అదర్శ పాఠశాలను సందర్శించారు. పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా జక్కాపూర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని కూడా పరిశీలించారు. కేంద్రాల్లో విద్యుత్, మంచినీటి సౌకర్యాన్ని ఎన్నికల లోపు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం హుడ్కులీ గ్రామంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి..

కాగజ్‌నగర్, ఏప్రిల్ 24 : ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండ పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సంజీవయ్య కాలనీ పాఠశాలతో పాటు మండలంలోని జంబుగా పాఠశాలను బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తీవారీతో కలిసి పరిశీలించారు. ఎన్నికల రోజు ఓటర్లకు ఇబ్బందులు పడకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈయన వెంట తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంఈవో భిక్షపతి, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఆర్ఐ ఖలీఖ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో వెనుకంజ

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రాష్ట్రంలో ఏడో స్థానం

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 24 : బుధవారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియట్ సెక్రెటరీ శృతి ఓజా ఇంటర్ ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఆసిఫాబాద్ జిల్లా 72.06 శాతంతో ఏడో స్థానం.. మొదటి సంవత్సర ఫలితాల్లో 61.55 శాతంతో 8వ స్థానంలో నిలిచింది.

ఏడో స్థానంలో నిలిచిన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా..

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచినట్లు డీఐఈవో శంకర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. జనరల్ విద్యార్థుల్లో 4,095 మంది పరీక్షకు హాజరు కాగా 2,951 మంది ఉత్తీర్ణులు అయి 72 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే ఏడో స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ ఫలితాల్లో 662 మందికి 526 మంది ఉత్తీర్ణత(79 శాతం-2వ స్థానం) సాధించారు. ప్రథమ సంవత్సరం జనరల్ ఫలితాల్లో 4,570 మంది విద్యార్థులకు 2813 మంది ఉత్తీర్ణత సాధించారు. (61.55 శాతం-8వ స్థానం), ప్రథమ సంవత్సరం ఒకేషనల్ ఫలితాల్లో 853 మందికి 480 మంది ఉత్తీర్ణత సాధించగా 56.27 శాతం ఉత్తీర్ణతతో 9వ స్థానంలో నిలిచారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

సమన్వయం, సమష్టితో పని చేయాలి..

- ఎంపీగా కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

చెన్నూర్, ఏప్రిల్ 24 : బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయం, సమష్టితో పనిచేస్తూ పెద్దపల్లి ఎంపీగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపునిచ్చారు. చెన్నూర్ పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం చెన్నూర్ మున్సిపాలిటీ, చెన్నూర్, కోటపల్లి, భీమారం మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ఎన్నికల సన్నాహాక సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. గడప గడపకూ ప్రచారం చేస్తూ కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. మంచిర్యాలలో మే నెల 4న నిర్వహించే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ బస్ యాత్ర రోడ్డు షోను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కేసీఆర్ బస్ యాత్రకు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చే విధంగా కృషి చేయాలని ఆయన తెలిపారు. త్వరలో జరుగునున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించనుందని, ఇప్పటికే ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసేందుకు నిర్ణయించుకున్నారని ఆయన తెలిపారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో చెన్నూర్ ఎంపీపీ మంత్రి బాపు, జడ్పీటీసీ మోతె తిరుపతి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజుద్దీన్, కోటపల్లి వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్‌రావు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు అజ్గర్ పాల్గొన్నారు.

ఏసీబీ విచారణ

- నాలుగు వరుసల రహదారి నష్టపరిహారంపై ఎంక్వయిరీ

రికార్డులను స్వాధీనం చేసుకున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా లో వేసిన నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం పంపిణీలో జరిగిన అక్రమాలపై ఏసీ బీ అధికారులు దృష్టి సారించారు. భారీ ఎత్తున ఫిర్యాదులు అందడంతో ఏసీబీ అధికారు లు విచారణ చేపట్టారు. ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి బుధవారం ఆర్డీవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. భూములు కోల్పోయిన వారి వివరాలు, బ్యాంకు ఖాతాల సమాచారం, వారికి అందించిన నష్ట పరిహారం వివరాలను తీసుకుని విచారణ చేపట్టారు.

కొనసాగుతున్న వివాదం

నాలుగు వరుసల రహదారి 364 నిర్మాణంలో భాగంగా భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపుల్లో భారీ ఎత్తున అవినీతి జరిగినట్లు తెలుస్తున్నది. రేపల్లెవాడ నుంచి వాంకిడి మండలంలోని గోయగాం వరకు 54 కిలోమీటర్ల మేర వేసిన నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన బాధితులు నష్టపరిహారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. రహదారి పనులు ప్రారంభిస్తుండగానే కావాల్సిన భూమి కోసం రెవెన్యూ అధికారులు అవార్డు ప్రకటన వెలువరించారు. మార్కెట్ ధరను అనుసరించి పరిహారం చెల్లిస్తారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో డబ్బులు చేతికి అందిన తర్వాతే పనులు ప్రారంభమవుతాయి. అయితే ఇందుకు విరుద్ధంగా జిల్లాలో నాలుగు వరుసల రహదారి పనులు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు పనులు పూర్తి అయినా కూడా బాధితులకు నష్టపరిహారం అందలేదు. నెలల తరబడి బాధితులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగూనే ఉన్నారు. విస్తరణలో పోయే భూములకు ఇష్టానుసారంగా సర్వేయర్లు పరిహారం లెక్క కట్టడంతో అర్హులకు సహాయం అందలేదు.ఆసిఫాబాద్, వాం కిడి, రెబ్బన మండలాల్లో దాదాపు 320 హెక్టార్ల భూమిని అధికారులు సేకరించారు. దీని కి సంబంధించి దాదాపు రూ.75 కోట్ల నష్టపరిహారం చెల్లించాలి.రోడ్డు నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది.పరిహారం చెల్లింపులవిషయం లో ఇప్పటి వివాదం కొనసాగుతూనే ఉంది.

వివరాలను సేకరిస్తున్న అధికారులు

భూసేకరణ సమయంలో సర్వేయర్లు కొలతలు తీసిన ప్రకారమే పరిహారం చెల్లింపులు జరుగుతున్నాయి. రెవెన్యూ యంత్రాంగం మార్కెట్ ధరలకు అనుగుణంగా కాకుండా ఇష్టానుసారంగా నిర్ణయించారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టాలు ఉన్న వాటిని ప్రభుత్వ భూములని నమోదు చేయడం, నష్టపోయే వారికి బదులుగా ఇతరుల ఖాతాల్లోకి పరిహారం డబ్బులు వేయడం, పక్క పక్కనే ఉన్న భూములు, భవనాలకు నష్టపరిహారం చెల్లింపుల్లో భారీ వ్యత్యాసాలు రావడం వంటి అంశాలు వెలుగు లోనికి వచ్చాయి. దీంతో నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో నష్టపరిహారాలకు సంబంధించి భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి. డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారితోపాటు సర్వేయర్లు, డిప్యూటీ తహసీల్దార్లు ఇష్టానుసారంగా నష్టపరిహారం చెల్లించి భారీగా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు పెద్ద ఎత్తు వస్తున్నాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. భూములు కోల్పోయిన వారి వివరాలతోపాటు, నష్టపరిహారం డబ్బులు పొందిన వారి ఖాతాల వివరాలను తీసుకుని విచారణ చేపడుతున్నారు.

లక్ష్యాలను అధిగమించడం
అభినందనీయం

- సింగరేణి సీఅండ్ఎండీ బలరాం
- బెల్లంపల్లి ఏరియాలో పర్యటన

గోలేటీ జీఎం కార్యాలయంలో ఏరియా పరిస్థితిని సీఎండీ బలరాంకు వివరిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్

రెబ్బెన, ఏప్రిల్ 24 : బెల్లంపల్లి ఏరియాకు సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను అధిగమించడం అభినందనీయమని సింగరేణి సీఎండీ బలరాం పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలో బుధవారం పర్యటించిన సీఎండీ ఖైర్‌గూడ ఓసీపీని సందర్శించి ఏరియాలోని పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గతేడాది బెల్లంపల్లి ఏరియా సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకతలను ఏరియా జీఎం రవిప్రసాద్ సీఎండీకి వివరించారు ఈ సందర్భంగా జీఎం, సిబ్బందిని అభినందించారు. భవిష్యత్‌లో కూడా సమష్టి కృషితో లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. ఖైర్‌గూడ ఓసీపీ వెస్ట్ వ్యూ పాయింట్ ద్వారా పని స్థలాలను పరిశీలించి, వట్టివాగు వంతెన నిర్మాణం పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవడం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్, ఖైర్‌గూడ ఓసీపీ పీవో సత్యనారాయణ, పీవో ఉమాకాంత్, ఏజీఎం తిరుమల్‌రావు, పీఈ వీరన్న, మేనేజర్ ప్రవీణ్‌ఫాటింగ్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ఎస్ఈ సివిల్ బాషా పాల్గొన్నారు.

సీఎండీకి వినతి

బెల్లంపల్లి ఏరియా పర్యటనకు వచ్చిన సింగరేణి సీఎండీ బలరాంకు బుధవారం ఏరియాలోని పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించినట్లు బెల్లంపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఏరియాలోని మదారంటౌన్‌షిప్, గోలేటిటౌన్‌షిప్ కార్మికకాలనీలతోపాటు గోలేటి డిస్పెన్సరీలో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని, గోలేటి ఓసీపీ ప్రారంభం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్యులను ఏర్పాటు చేయాలని, గోలేటి జీఎం కార్యాలయం ఉద్యోగుల సౌకర్యార్థం రెస్ట్‌హాల్ నిర్మాణం, వెహికిల్ డ్రైవర్ల రెస్ట్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం ద్వారా కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ నాయకులు సంగెం ప్రకాశ్‌రావు, ఏరియా కార్యదర్శులు సంజీవ రెడ్డి, చంద్రకుమార్, నాయకులు ప్రభాకర్, వామన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్సిల్ ఫుడ్‌లో ఎలుక

పార్సిల్ ఫుడ్‌లో వచ్చిన ఎలుక

సామాజిక మాధ్యమాల్లో వైరలైన వీడియో

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 24 : మంచిర్యాల బస్టాండ్ పక్కనున్న శ్రీగీతా భవన్ హోటల్ నుంచి ఓ వ్యక్తి ఉప్మా పార్సిల్ తీసుకెళ్లారు. ఇంటికెళ్లి కొంచెం తిన్నాక ఉప్మాలో చిన్న ఎలుక కనిపించింది. దీంతో హుటాహుటిన హోటల్‌కు చేరుకున్న బాధితుడు పార్సిల్‌లో ఎలుకను చూపించి హోటల్ నిర్వాహకులను నిలదీశారు. తిన్న వ్యక్తికి ఏమైనా జరిగితే మీదే బాధ్యత అంటూ చెప్పారు. ఈ వీడియో బుధవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై హోటల్ యాజమాని చంద్రశేఖర్‌శెట్టిని వివరణ కోరగా.. అది సంవత్సరం కిందట జరిగిందన్నారు. కావాలనే ఫుడ్‌లో ఎలుకని వేసి తీసుకొచ్చి బ్లాక్ మెయిల్ చేశారన్నారు. పోలీసు కేసు పెడతామని చెప్పడంతో తిరిగి వెళ్లిపోయారన్నారు. కావాలనే ఉద్దేశపూర్వకంగా కొందరు వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారన్నారు. ఈ విషయం పక్కన పెడితే మంచిర్యాలలో చాలా హోటళ్లలో ఆహారం తయారు చేసేప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. హోటళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయడంలో విఫలమవుతున్నారు. ప్రతి రోజూ ఏదో ఒక హోటల్‌లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా బయటికి రావడం లేదు. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు మంచిర్యాల పట్టణంలో హోటళ్లపై ఓ లుక్ వేయాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి సాగుపై ఉక్కుపాదం

- విస్తృతంగా అవగాహన సదస్సులు
- యువత పెడదారి పట్టకుండా చర్యలు

సిర్పూర్(యు)లో గంజాయిని తరలిస్తున్న నలుగురిని పట్టుకున్న పోలీసులు

జైనూర్ మండలంలో ఇటీవల పట్టుబడ్డ గంజాయి

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 24(నమస్తే తెలంగాణ) : మారుమూల గ్రామాల్లో గంజాయి గుట్టు చప్పుడు కాకుండా సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పోలీసులు చేపడుతున్న తనిఖీల్లో గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ ఘటనలే నిదర్శనం. గుడుంబా తయారీ, గంజాయి సాగుపై గతంలో ఉక్కుపాదాన్ని మోపిన పోలీసులు దాదాపుగా నిర్మూలించారు. కానీ.. ఇటీవల గంజాయి రవాణా చేస్తూ స్మగ్లర్లు పట్టుబడుతున్న ఘటనలు మళ్లీ వెలుగు చూస్తున్నాయి. దీనిని బట్టి జిల్లాలోని మారుమూల గ్రామాల్లో గంజాయి సాగు గుట్టు చప్పుడు కాకుండా సాగవుతున్న అర్థమవుతోంది.

తాజాగా పట్టుబడిన ఘటనలు

జైనూర్ మండలంలలోని గౌరీ గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడా గ్రామానికి చెందిన ఆత్రం భీంరావు ఇంటి వద్ద మూడు కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. సిర్పూర్(యు) మండలంలో నలుగురి వద్ద నుంచి 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మోటార్ సైకిల్‌పై పాములవాడ గ్రామం నుంచి సిర్పూర్(యు) వైపు గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు.

గతంలో గంజాయిపై ఉక్కుపాదం

గంజాయి సాగు, గుడుంబా తయారీపై కేసీఆర్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టడంతో అధికారులు పూర్తిగా నిషేధించారు. గుడుంబా తయారీకి అడ్డుకట్ట వేసిన పోలీసులు గంజాయి సాగుపై కూడా ఉక్కుపాదం మోపారు. దాడులు నిర్వహించి, యువత గంజాయి మత్తుకు బానిస కాకుండా విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానంగా గుట్టలను అనుకుని గిరిజనులు వ్యవసాయం చేయకుండా అడ్డుకున్నారు. రవాణ, విక్రయాలను చేసే వ్యాపారులు గిరిజనుల చేలలో సాగు చేసేలా ప్రోత్సహించేవారిపై చర్యలు తీసుకున్నారు. పోలీసులు దాడులు చేయడంతో అడ్డుకట్ట పడింది. కొద్ది రోజులుగా గంజాయి పట్టుబడతున్న సంఘటనలు వెలుగు చూస్తుంటంతో పోలీసులు దృష్టిసారించారు. చేలలో తనిఖీలు చేపడుతున్నారు. గంజాయి సాగుచేస్తున్న సమాచారాన్ని పక్కాగా సేకరించి దాడులు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి

వీసీలో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 24 : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలింగ్‌కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలలో భాగంగా పోలింగ్ రోజున పూర్తిస్థాయిలో ఓటింగ్ జరిగేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్ స్లిప్పులు ప్రతి ఓటరుకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు, అధికారులతో కలిసి హాజరయ్యారు.

అత్యాచారం కేసులో 20 ఏండ్ల జైలు

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 24 : అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ బుధవారం తీర్పు వెలువరించారు. ఆసిఫాబాద్ డీఎస్పీ నదయ్య వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన చంద్రి మౌనిక ఇంటర్ చదువుతోంది. యువతిని తుంపెల్లి గ్రామానికి చెందిన పోలవేణి సాయి మాయ మాటలు చెప్పి ఫిబ్రవరి 2, 2019న కిడ్నాప్ చేసి శారీరంగా లోబర్చుకున్నాడు. అంతకుముందు కూడా సదరు యువతని వివాహం చేసుకుంటానని అనేక సార్లు శారీరకంగా లోబర్చుకున్నాడు. మౌనిక తండ్రి చంద్రి దామోదర్ ఫిబ్రవరి 3, 2019న ఆసిఫాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అప్పుడు విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ, లైజనింగ్ అధికార్ దయానంద్ నిందితుడైన సాయిని అరెస్ట్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. పీపీ జీవీఎస్ ప్రసాద్ సాక్షులను ప్రవేశపెట్టగా వారిని విచారించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో పొలవేణి సాయికి 20 ఏండ్ల జైలుశిక్షతోపాటు రూ.5 వేల నగదును జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఇంటర్‌లో ఫెయిల్ అయ్యామని..

వేర్వేరు చోట్ల ఇద్దరు విద్యార్థుల బలవన్మరణం

సాత్విక్(ఫైల్)

తేజస్విని (ఫైల్)

తాండూర్, ఏప్రిల్ 24 : అచ్చలాపూర్ గ్రామంలో బుధవారం విషాదం నెలకొంది. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో గ్రామానికి చెందిన మైదం సాత్విక్(16) బుధవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. బెల్లంపల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ చదివిన సాత్విక్ నాలుగు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సాత్విక్ తల్లిదండ్రులు నారాయణ-విజయ గ్రామానికి చెందిన ఓ వివాహ వేడుకకు వెళ్లారు. ఇంట్లో ఉన్న సాత్విక్ ఫలితాలు చూసుకున్న కొద్ది సేపటికి తాత రాజయ్యకు పాస్ అయ్యానని చెప్పి ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. నారాయణ తిరిగి ఇంటికి వచ్చి తలుపులు కొట్టినా తీయకపోయేసరికి అనుమానం వచ్చి గడియ తొలగించి లోనికి వెళ్లాడు. అప్పటికే సాత్విక్ ఉరి వేసుకుని నిర్జీవంగా ఉన్నాడు. నారాయణ ఒక్కసారిగా ఆర్తనాదాలు చేయడంతో విషయం తెలిసింది. ఘటన విషయం తెలుసుకున్న ఎస్ఐ జగదీశ్‌గౌడ్ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు.

దొరగారిపల్లికి చెందిన విద్యార్థిని..

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 24 : సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొరగారిపల్లి గ్రామానికి చెందిన గట్టిక తేజస్విని(18) మంచిర్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం ఇంటర్ ఫలితాలు విడుదలవగా.. రిజల్ట్స్ చూసుకున్న తేజస్విని తన ఎంపీసీ గ్రూప్‌లోని రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయింది. దీంతో మనస్తాపం చెందిన ఆమె బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆమె మంచిర్యాలలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే తేజస్విని మృతిచెందిందని చెప్పడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. తండ్రి గట్టిక శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ వివరించారు.